మరో 20 రోజుల్లో సుందర పుట్టపర్తి

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్/కొత్తచెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకల నాటికి పుట్టపర్తిని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రూ.10కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరో 20 రోజుల్లో పనులు పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పడమటిగేట్ రోడ్డు అభివృద్ధికి రూ.1.4 కోట్లు, వీధిలైట్లు రూ. 20లక్షలు, డ్రైనేజీ రిపేరీ, శానిటేషన్‌కు రూ.70లక్షలు, డీఎంఎఫ్, మునిసిపాలిటీ స్పెషల్‌గ్రాంట్ నిధుల ద్వారా మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు మరో రూ 1.5కోట్ల వ్యయం చేస్తున్నామన్నారు. శానిటేషన్ మరమ్మతు పనులు కోసం ఆదనంగా 20 మంది కార్మికులను నియమించినట్లు తెలిపారు. పట్టణంలో బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.4కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సహకారంతో సీసీ కెమెరాలు, డ్రోన్లు ఇతరత్ర భద్రతా ఏర్పాట్ల కోసం రూ.1.16 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీఎస్ఆర్ నిధులతో జోయలుకాస్ సంస్థ చిల్డ్రన్‌పార్క్ అభివృద్ధి పనులు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

హైవే వెహికిల్స్..!

రాత్రి ప్రయాణాలకు భద్రత కరువు

హృదయాలను కలిచివేసిన కర్నూలు ప్రమాదం

పన్నెండేళ్ల కిందట 45 మంది..

ఇప్పుడు 19 మంది..

ఏసీ బస్సులో బుగ్గి అయిన ప్రాణాలు

ఉమ్మడి జిల్లా నుంచి పెరిగిన వీకెండ్ ప్రయాణాలు

భద్రత గాలికి.. ఆదాయంపైనే ట్రావెల్స్ దృష్టి



అనంతపురం క్రైం/నెట్‌వర్క్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం ఉమ్మడి జిల్లావాసులను కంటతడి పెట్టించింది. ఉదయం లేవగానే ఈ విషాదకర సంఘటన గురించి తెలుసుకుని జనం ఆవేదన చెందారు. న్యూస్ చానళ్లు, సోషల్ మీడియాలో ప్రమాద దృశ్యాలను చూసి చలించిపోయారు. జాతీయ రహదారులపై ప్రైవేట్ ట్రావెల్ బస్సులలో ప్రయాణం అంటేనే జంకే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగళూరు-హైదరాబాదు 2013 అక్టోబరులో మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ ప్రైవేటు బస్సు దగ్ధమై 45 మంది సజీవ దహనమయ్యారు. పుష్కర కాలం తరువాత ఇదే నెలలో కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద మరో ఘోరం జరిగింది. బస్సులో 19 మంది సజీవ దహనమయ్యారు. ఇవి కాక అనేక ప్రమాదాలు జరిగాయి. దీంతో ట్రావెల్ బస్సులలో భద్రత గురించి మరో మారు చర్చ మొదలైంది. ఏసీ బస్సుల్లో జాతీయ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఆలోచించాల్సిందేనని జనం అంటున్నారు. కొన్ని బస్సుల్లో భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం లేదని అంటున్నారు. ప్రయాణికుల భద్రత గాలికి వదిలేశారని మండిపడుతున్నారు. ఈ ప్రమాదంపై జిల్లా ప్రజాపతినిధులు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా (మిగతా 6వ పేజీలో..)

భద్రత గురించి తెలియజేయాలి..



నేను హైదరాబాద్‌లో బిల్డర్. నేను, నా కుటుంబ సభ్యులు తరుచూ మా గ్రామం నుంచి నెలకు రెండు, మూడుసార్లు హైదరాబాద్ వెళ్లాల్సి వస్తుంది. ప్రతిసారీ బెంగళూరు నుంచి వెళ్లే ఓల్వో బస్సుల్లోనే ప్రయాణం చేస్తున్నాం. ప్రయాణ సమయంలో ప్రమాదాలు ఎదురైతే ఎలా బయట పడాలో.. బస్సు కదిలే ముందు ప్రయాణికులకు అవగాహన కల్పించాలి. ఎమర్జెన్సీ ద్వారం ఎక్కడ ఉంటుందో, దాన్ని ఎలా తెరవాలో ప్రయాణికులకు తెలియదు. అందుకే ప్రాణ నష్టం ఎక్కువగా జరుగుతోంది. బస్సు కదిలే ముందు ప్రయాణికులకు ఈ విషయాల గురించి బస్సు డ్రైవర్ లేదా సిబ్బంది తెలియజేయాలి. చాలా బస్సులకు విండో సిస్టం ఉండటం లేదు. అద్దాలతో పూర్తిగా కప్పేస్తున్నారు. బయట పడాలంటే వాటిని బద్ధలు కొట్టాలి. అత్యవసర సమయంలో అది సాధ్యం కాదు. అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలను ఆర్పేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో ఉండవు. అన్నింటికంటే ప్రమాదకరమైనది బస్సు డ్రైవర్లకు వేగంపై నియంత్రణ ఉండకపోవడం. ప్రయాణికులు బస్సు టికెట్ బుక్ చేసుకున్న సమయంలోనే బస్సు కండిషన్, డ్రైవర్ల కండిషన్ వివరాలను తెలియజేయాలి. బస్సుల యాజమాన్యం ప్రయాణికుల భద్రతను పట్టించుకోవడం లేదు. విధి లేక వాటిలో ప్రయాణించాల్సి వస్తోంది.

- చంద్రశేఖర్, కోట్లోపల్లి, చిలమత్తూరు మండలం

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. ప్రమాద రహిత జిల్లాగా నిలిపేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ శుక్రవారం జిల్లాస్థాయి రహదారుల భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారుల్లో బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మలుపుల వద్ద ముళ్లపొదలు తొలగించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయన్నారు. బ్లింకర్లు, ఫ్లాషెస్, జాతీయ రహదారుల్లో మలుపుల వద్ద విద్యుద్దీపాలు, స్పీడ్ బ్రేకర్లు, సైన్‌బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రవాణా, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులు, ఆర్డీఓలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

డ్రగ్స్ మహమ్మారికి యువత దూరంగా ఉండాలని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి ఈగల్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యువత మంచి, చెడులను గమనించి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల నివారణ, టోల్ ఫ్రీ నంబర్లకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఎస్పీతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీఓలు సువర్ణ, శర్మ, మహేష్, డీఎస్పీలు నరసింగప్ప హేమంత్ కుమార్, డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, డీఈఓ కిష్టప్ప పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేకూరేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన కల్పిస్తూ కేసుల నమోదును తగ్గించాలని రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓలు సువర్ణ, మహేష్, ఆనంద్ కుమార్, వీవీఎస్ శర్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద పాల్గొన్నారు.

27న కదిరిలో పరిష్కార వేదిక

కదిరిలో ఈనెల 27న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కదిరి ఆర్డీఓ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలన్నారు.

సత్యసాయి వేడుకలకు రండి

కర్ణాటక సీఎంకు సత్యసాయి ట్రస్టు ఆహ్వానం

పుట్టపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనాలంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు శుక్రవారం ఆహ్వానించారు. మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ట్రస్టు సభ్యుడు నాగానందం బెంగళూరులోని సీఎం కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఆహ్వాన పత్రిక అందజేశారు. తమ ట్రస్టు ద్వారా కర్ణాటక వైట్‌ఫీల్డ్‌లో శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అందిస్తున్న సేవల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ట్రస్టు ద్వారా కొనసాగిస్తున్న సేవల గురించి ఆయనకు తెలిపారు.

హైవేపై ధర్మవరం టెకీ సాహసం

పది మందిని కాపాడిన హరీష్

(వివరాలు మెయిన్‌లో)



పుట్టపర్తిలో ఆక్రమణల తొలగింపు



పట్టణంలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటుచేసిన దుకాణాలను తొలగించడంతో విశాలంగా కనిపిస్తున్న రహదారి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో దశాబ్దాలుగా వెలసిన ఆక్రమణలను తొలగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ తిప్పలు తప్పుతున్నాయి. సత్యసాయి శత జయంత్యుత్సవాల నేపథ్యంలో పోలీసులు మూడు రోజులుగా ఆక్రమణలను తొలగింపజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం గణేష్ గేట్ ఎదురుగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, బస్టాండు ఎదురుగా, గోపురం గేట్, గణేష్ గేట్, సత్యసాయి జనరల్ హాస్పిటల్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఆటోలను అడ్డంగా పార్కింగ్ చేయడంతో పుట్టపర్తికి వచ్చే భక్తులతోపాటు స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఎస్పీ సతీష్ కుమార్ స్వయంగా పరిశీలించి, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ మేరకు డీఎస్పీ విజయ్‌కుమార్, పట్టణ సీఐ శివాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు.. ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రధాన రహదారులపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు అపరాదని హెచ్చరించారు. బస్టాండు ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్‌ను సత్యమ్మ దేవాలయం వద్దకు తరలించారు. గణేష్ గేట్, గోపురం గేట్ ప్రధాన రహదారిపై ఆటోలను ఆపరాదన్నారు. రహదారి పక్కన ఏర్పాటుచేసిన దుకాణాలను బస్టాండు ఎదురుగా ఉన్న ఖాళీ ప్రాంతానికి తరలించారు. ఆటోలు గణేష్ గేట్, గోపురం గేట్ వద్ద నిలపకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నిరసన



అంబేడ్కర్ సర్కిల్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

హిందూపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ నాయకులు నిరసించారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం ఆందోళన చేస్తూ, జగన్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు, ఎస్ఐ శ్రీధర్ నిరసనకారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మునిసిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బాలకృష్ణను కించపరుస్తూ మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీవారు చేసిన అరాచకాలు, దౌర్జన్యాల వల్లే ప్రజలు 11సీట్లకే పరిమితం చేశారన్నారు. సైకో జగన్ అంటూ నినాదాలు చేశారు. బాలకృష్ణకు క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ అనిల్, నాయకులు నాగరాజు, ఆనంద్, రాము, మంగేష్, బాబి, అమర్, మంజునాథ్, అమీర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.



విశ్వశాంతి నగర్‌లో ఇళ్ల మధ్య ప్రవాహం

వాన వెల్లువ

ఉధృతంగా ప్రవహించిన ఆలమూరు చెరువు మరువ

- రుద్రంపేట పరిధిలోని పలు కాలనీలు జలమయం
- వరదలో చిక్కుకున్న విశ్వశాంతి నగర్
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు
- 11 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- పలు ప్రాంతాల్లో పంట నష్టం
- మరో ఐదు రోజులు వర్షాలు

వాన దంచికొట్టింది. జిల్లాలోని చాలా మండలాల్లో గురువారం రాత్రి ఎడతెరపి లేని వాన కురిసింది. పలు వంకలు, వాగులు ఉప్పొంగాయి. అనంతపురం రూరల్ మండలంలోని ఆలమూరు చెరువు మరువ ఉధృతంగా ప్రవహించడంతో రుద్రంపేల పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. విశ్వశాంతి నగర్ వదర నీటిలో చిక్కుకుంది. కాలనీవాసులు వరద నీటిలో బిక్కుబిక్కుమంటూ గడిపారు. మరో ఐదురోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికల నేపథ్యంలో జనం వణికిపోతున్నారు. విశ్వశాంతి నగర్‌లో వరద నీటిలో చిక్కుకున్న 11 మందిని అగ్నిమాపక శాఖాధికారులు రక్షించారు.

అనంతపురం రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. హంద్రీనీవా నీటితో అనంతపురం రూరల్ మండలంలోని ఆలమూరు చెరువు పూర్తిగా నిండి, మూడు రోజుల కిందట మరువ పారింది. దీనికి వర్షపునీరు తోడవటంతో ప్రవాహం పెరిగింది. ఆ నీరు అనంతపురం రూరల్ మండలంలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలోని పలు కాలనీలను ముంచెత్తింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఒక్కసారిగా విశ్వశాంతినగర్, గౌరవ్ రెసిడెన్సీస్, వికాస్ నగర్ ప్రాంతాలు నీటమునిగాయి. సాయంత్రమైనా ఇదే పరిస్థితి కనిపించింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు లోనయ్యారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. నీరు ఇళ్లలోకి చేరడంతో నిత్యావసర సరుకులు, వస్తువులు తడిసిపోయాయి. ఈక్రమంలో మండల పరిషత్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలోకి నీరు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్లతో స్థానికంగా ఉన్న కాలువలోకి మళ్లించారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్న వారికి అగ్నిమాపక శాఖ సిబ్బంది రోప్ సాయంతో తీసుకొచ్చారు. అల్పాహారం, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. నష్టం వివరాలను రెవెన్యూ అధికారులు.. స్థానికుల ద్వారా సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ దివాకర్, సీఐ జగదీష్ పాల్గొన్నారు. కొడిమి గ్రామ సమీపంలో రాచానపల్లి వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో జర్నలిస్టుల కాలనీ, దర్గాకొట్టాల తదితర ప్రాంతాల ప్రజలు నగరానికి వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.



విశ్వశాంతి నగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు

11 మందిని కాపాడిన ఫైర్ సిబ్బంది

అనంతపురం క్రైం: వరద నీటిలో ఇళ్లలో చిక్కుకున్న 11 మందిని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రుద్రంపేట పంచాయతీలోని విశ్వశాంతినగర్‌లోకి వరద నీరు భారీగా వచ్చింది. ఇళ్లను చుట్టుముట్టింది. ఆలమూరు ప్రధానరహదారి నుంచీ రుద్రంపేట 4వ సచివాలయం, వికాస్ నగర్ ఏరియాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులుపడ్డారు. వరద నీరు విశ్వశాంతి నగర్‌లోని పలు ఇళ్లలోకి చేరడంతో బయటకు వచ్చేందుకు అవస్థలు పడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. విశ్వశాంతినగర్‌లోని డోర్ నంబర్ 5-12లో ఉంటున్న రమేష్ (32), లతాంజలి(27), రామాంజనేయులు(60), ఈశ్వరమ్మ(55), జస్విన్(6), రెండున్నరేళ్ల హన్విత, డోర్ నంబర్ 5-13లోని బ్రహ్మయ్య(37), శాంతమ్మ(65), సునీత(34), 15 నెలల వయసున్న మోక్షిత, మోక్షితనందను అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా తాళ్ల సాయంతో బయటకు తీసుకొచ్చారు. సహాయక చర్యల్లో జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి లింగమయ్య, లీడింగ్ ఫైర్‌మన్ చిన్న వెంకటరాముడు, ఫైర్‌మెన్ ప్రకాష్‌నాయుడు, గంగాధర్, ప్రసాద్, బాలవెంకటయ్య, వెంకటనాయుడు, డీపీఓ రాఘవేంద్ర పాల్గొన్నారు.



బాధితులను వరద నీటి నుంచి బయటకు తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది



విశ్వశాంతి నగర్‌లో ఇళ్ల చుట్టూ నీరు



అనంత శివారులో వంకను తలపిస్తున్న జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు



చెరువును తలపిస్తున్న రజక్ నగర్

రాప్తాడులో 9.4 సెంటీమీటర్ల వర్షపాతం

అనంతపురం అర్బన్: జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం వర్షం కురిసింది. అత్యధికంగా రాప్తాడు మండలంలో 9.4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. యల్లనూరు 7.8, అనంతపురం 7.1, శింగనమల 6.0, బుక్కరాయసముద్రం 5.0, తాడిపత్రి 4.6, పెద్దవడుగూరు 4.1, నార్పల, యాడికి 4.0, కూడేరు 3.9, ఆత్మకూరు 3.1, పెద్దపప్పూరు 2.6, రాయదుర్గం 2.1, గార్లదిన్నె, ఉరవకొండ, కళ్యాణదుర్గం 2.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.6 సెంటీ మీటర్లలోపు వర్షపాతం నమోదైంది.

పంటనష్టం

యల్లనూరు మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో యల్లనూరు సమీపంలోని ఎర్రవంక, కట్టుకాలువ, నడిమివంక ఉధృతంగా ప్రవహించడంతో యల్లనూరు చెరువు నిండింది. చెరువు మరువ పారడంతో పాతపేటలోని 100 ఎకరాల్లో కోత దశలోని వరి పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. యల్లనూరు, కృష్ణాపురం, పాతపల్లిలో 60 ఎకరాల్లో కోత కోసి ఆరబెట్టిన మొక్కజొన్న పంట వర్షపు నీటితో తడిసింది. యాడికి మండలం వేములపాడులో హెక్టారులో రూ.2 లక్షల విలువైన టమోటా పంటకు నష్టం వాటిల్లింది. ఆత్మకూరులో 1.6 హెక్టార్లల్లో రూ.4 లక్షల విలువైన అరటి పంటకు నష్టం వాటిల్లింది. శెట్టూరు మండలంలో హెక్టారులో రూ.1.5 లక్షల విలువైన అరటి పంట దెబ్బతింది. కంబదూరు మండలంలో 1.2 హెక్టార్లలో రూ.లక్ష విలువైన బీర పంట దెబ్బతింది.

రానున్న ఐదు రోజుల్లో వర్ష సూచన

బుక్కరాయసముద్రం: రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పగటి ఉష్ణోగ్రతలు 28-30.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22-23.5 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 8-12 కి.మీ., వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 84-87, మధ్యాహ్నం 58-80 శాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రానున్న ఐదు రోజుల్లో అనంతపురం జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. 25న 2.2 సెం.మీ.లు, 26న 0.52, 27న 0.10, 28న 0.40, 29న 0.25 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 25న 2.2 సెం.మీ., 26న ఒక సెం.మీ., 27న 0.5 సెం.మీ., 28న 0.12 సెం.మీ., 29న 0.17 సెం.మీ, వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.



పోతులనాగేపల్లి వద్ద ఉధృతంగా పారుతున్న చిత్రావతి నది

చిత్రావతి చిందులు

ధర్మవరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది చిందులు తొక్కుతోంది. మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొత్తచెరువు, బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి వచ్చిన వర్షపునీరు చిత్రావతి నదికి చేరుతోంది. నది ఉధృతంగా ప్రవహి స్తుండటంతో చేపలు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో గ్రామస్థులు ఉల్లాసంగా చేపలు పడుతూ కనిపించారు. నదీ ప్రవాహంతో పరివాహక ప్రాంతాల్లోని బోరుబావుల్లో నీరు పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నది ఉధృతం గా ప్రవహిస్తుండటంతో పోతులనాగేపల్లి నుంచి కనంపల్లి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

తెరుచుకున్న వైవీఆర్ గేట్లు

ముదిగుబ్బ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండా సమీపాన ఉన్న యోగివేమన రిజర్వాయర్ (వైవీఆర్) పూర్తిగా నిండిపోవడంతో అధికారులు శుక్రవారం రెండు గేట్లు ఎత్తి, నీటిని నదికి వదిలారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 0.805 టీఎంసీలు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి 1,688 క్యూసెక్కుల వరద జలాశయంలోకి వస్తోంది. దీంతో రెండు గేట్ల ద్వారా 1,688 క్యూసెక్కుల నీటిని మద్దిలేరుకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు డీఈఈ రాజన్న తెలిపారు. దీంతో ముదిగుబ్బ-పులివెందుల రహదారిలో మద్దిలేరు వంక వద్ద రాకపోకలకు ఇబ్బంది కలిగింది. జలాశయం కింద ఉన్న దొరిగల్లు, ఇందుకూరు, నాగులగుబ్బల, నక్కలపల్లి, ఏబీ పల్లి, ఏబీ పల్లి తండా, మర్తాడు, బండ్లపల్లి, కొడవండ్లపల్లి గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



జలాశయం గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

బెల్టు కనిపిస్తే...

బైండోవర్ కేసు..!

- సురక్ష యాప్‌తో మద్యం విక్రయాల్లో పారదర్శకత
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అనంతపురం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త యాప్ సురక్ష స్కానర్ల ద్వారా జిల్లాలో మద్యం అమ్మకాలు పాదర్శకంగా జరుగుతున్నాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బెల్టు దుకాణాలు కనిపిస్తే.. బైండోవర్ కేసులు నమోదు చేయాలని సీఐలను ఆదేశించామని ఆయన స్పష్టం చేశారు. నాటుసారాను కట్టడి చేయడమేకాకుండా గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు.



ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం



ఆంధ్రజ్యోతి: జిల్లాలో నాటుసారా తయారీపై నిఘా పెట్టారా.. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఈఎస్: ఈ ఏడాది జనవరి నుంచీ అక్టోబరు 20వ తేదీ వరకూ నాటుసారాకు సంబంధించి 274 కేసులు నమోదు చేశాం. ఈ కేసుల్లో 244 మందిని అరెస్టు చేయడమేకాకుండా 8 వాహనాలు సీజ్ చేశాం. మరో 1,505 లీటర్ల నాటుసారా సీజ్ చేశాం. 27,575 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశాం.

ఆంధ్రజ్యోతి: ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం జిల్లాలోకి రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఈఎస్: ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమ విక్రయాల కోసం దొడ్డిదారిన లిక్కర్ తరలించడం నేరం. ఎన్‌డీపీఎల్ లిక్కర్‌కు సంబంధించి 420 కేసులు నమోదు చేశాం. ఈ కేసులకు సంబంధించి 441 మందిని అరెస్టు చేశారు. 3,885 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. 36 వాహనాలను సీజ్ చేశాం. అనధికార లిక్కర్‌కు సంబంధించి 550 కేసులు నమోదు చేసి, 557 మందిని అరెస్టు చేశాం. వారి నుంచీ 264 లీటర్ల అనధికార మద్యం స్వాధీనం చేసుకుని, 3 వాహనాలు సీజ్ చేశాం. కల్తీ కల్లును సైతం 249 లీటర్లు స్వాధీనం చేసుకున్నాం. 10 మందిని అరెస్టు చేశాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి కట్టడిపై నిఘా పెట్టారా... ఇప్పటి వరకూ ఎంత మేర సీజ్ చేశారు?

ఈఎస్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టి, నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 7 కేసులు నమోదు చేసి, 10 మందిని అరెస్టు చేశాం. ముద్దాయిల నుంచీ 13.47 కేజీలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశాం. గంజాయి ఎక్కడ కనిపించినా... కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్ష యాప్ ఏవిధంగా పనిచేస్తోంది.. అమ్మకాలు ఎలా సాగుతున్నాయి..?

ఈఎస్: మద్యం అమ్మకాలు పారదర్శకంగా సాగించేందుకు ఎక్సైజ్ సురక్ష యాప్ ఎంతగానో దోహదపడుతుంది. దుకాణదారులు మాత్రమే కాకుండా కస్టమర్లు సైతం యాప్ ను విరివిగా ఉపయోగిస్తున్నారు. యాప్ ద్వారానే జిల్లాలో ఈనెల 19న ఏకంగా రూ.2.59 కోట్లు, ఈనెల 20న రూ. 2.20 కోట్ల అమ్మకాలు జరిగాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు స్కాన్ చేసిన లిక్కర్ బాటిళ్లు మాత్రమే విక్రయించాలి.

ఆంధ్రజ్యోతి: బెల్టు షాపుల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈఎస్: జిల్లాలో బెల్టు షాపులు ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని ఎక్సైజ్ స్టేషన్ల సీఐలను ఆదేశించారు. బెల్టు కనిపిస్తే.. బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఇప్పటికే సూచనలు ఇచ్చాం. నిబంధనలు పాటించకుంటే... కఠిన చర్యలు తప్పవు.


బాధాకరం..



బస్సు ప్రమాదం బాధాకరం. ఈ ఘటన తీవ్రంగా కలవేసింది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలుగా సాయం చేస్తుంది, అండగా నిలుస్తుంది.

-వెంకటశివుడు యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు


ప్రభుత్వం అండగా ఉంటుంది..



బస్సు ప్రమాదం అత్యంత బాధాకరం. ప్రయాణికులు సజీవ దహనం కావడం దురదృష్టకరం. క్షతగాత్రులు త్వరగా కోలుకుంటారని ఆశిస్తున్నాను. మరణించిన వారి కుటుంబీకులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాను.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే

అత్యంత బాధాకరం..



ప్రైవేట్ బస్సు దగ్ధమై ప్రయాణికులు మృతిచెందటం అత్యంత బాధాకరం. ప్రమాదం గురించి తెలియగానే హృదయం కలిచివేసింది. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నాను. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

మనోధైర్యంతో ఉండాలి..



బస్సు దుర్ఘటన అత్యంత విషాదకరం. భగవంతుడు ఆ కుటుంబాలకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుంది.

-గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

హైవే వెహికిల్స్..!

(5వ పేజీ తరువాయి)

ఉంటుందని పేర్కొన్నారు.

పెరుగుతున్న వీకెండ్ జర్నీలు


ఉమ్మడి జిల్లాలో వీకెండ్ ప్రయాణాలు పెరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బీటెక్, ఎంబీబీఎస్ తదితర ఉన్నత విద్యను అభ్యసించేవారు వారాంతపు సెలవుల్లో స్వస్థలాలకు వచ్చి తిరిగి వెళుతుంటారు. వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువగా బెంగళూరు, హైదరాబాద్ నడుమ ప్రయాణాలు సాగుతున్నాయి. ఈ మార్గంలో రాత్రిళ్లు హైవేపై ప్రైవేట్ ట్రావెల్ బస్సులు సర్రున దూసుకుపోతుంటాయి. చూసే వారికి ఒళ్లు గగుర్పొడిచేంత వేగంగా ప్రయాణిస్తుంటాయి. ఉమ్మడి జిల్లావాసులు బెంగళూరు-హైదరాబాద్, బెంగళూరు- అనంతపురం, హైదరాబాద్-అనంతపురం నడుమ ఎక్కువగా ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. రాత్రి పూట ప్రయాణానికి ఏసీ స్లీపర్ కోచ్ బస్సులను ఎంచుకుంటారు. కునుకుతీసి లేచేలోగా గమ్యస్థానంలో ఉండొచ్చని భావిస్తారు. వీరిద్వారా ట్రావెల్ నిర్వాహకులకు భారీగా ఆదాయం సమకూరుతోంది. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు రూ.1200 వరకూ రూ.1500 వరకూ వసూలు చేస్తున్నారు. వీకెండ్స్, పండుగ పూట ఇది మరింత పెరుగుతుంది. బస్సుల రేటింగ్స్, ట్రావెల్స్ రేటింగ్స్ బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ వసూలు చేస్తారు. కానీ భద్రత విషయం గురించి పట్టించుకోవడం లేదు.

భద్రత ఉందా..?

అనంతపురం జిల్లాలో సుమారు 54 ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నడుస్తున్నాయి. అనంతపురం నుంచి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు వీటిని నడుపుతున్నారు. ఇవికాక బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వందలాది బస్సులు జిల్లామీదుగా ప్రయాణిస్తాయి. వీటిలో భద్రతా ప్రమాణాల గురించి అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీఓ అధికారులు ప్రైవేట్ బస్సులపై మే నెలలో 31 కేసులు, జూన్‌లో 46, జులైలో 30, ఆగస్టులో 20, సెప్టెంబరు 11, ఈ నెలలో ఇప్పటి వరకూ 26 కేసులు నమోదు చేశారు. పక్కాగా తనిఖీలు నిర్వహిస్తే మరిన్ని కేసులు నమోదవుతాయని ప్రయాణికులు అంటున్నారు.

బస్సు ప్రమాదం కలిచివేసింది

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి



తాడిపత్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం కలచివేసిందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టౌన్ బ్యాంక్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బస్సుల నిర్మాణంలో లోపంవల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని కొందరు మాట్లాడడం బాధాకరమని అన్నారు. తాము 1934 నుంచి బస్సులను నడుపుతున్నామని, దివాకర్ ట్రావెల్స్‌కు పేరు రావడంతోనే తాము ఈ స్థాయిలో ఉండగలిగామని అన్నారు. తమకు బస్సులంటే అమితమైన ప్రేమ అని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా కాపాడుకుంటామని అన్నారు. గతంలో ఆలిండియా పర్మిట్ విధానం ఉండేదని, దాన్ని రద్దు చేయడంతో బస్సులపై అవగాహన లేనివారు కూడా ట్రావెల్స్‌ను నడుపుతున్నారన్నారు. సింగిల్ విధానం అమలు చేస్తే ట్రావెల్స్ తగ్గుముఖం పడతాయని అన్నారు. గతంలో కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వారే ఎక్కువగా నడిపేవారని, ప్రస్తుతం ట్యాక్స్‌లు పెరగడంతో నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్ నుంచే బస్సులు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. సౌత్ ఇండియాలో బస్సుల నాణ్యత బాగుంటుందని, నార్త్ ఇండియాలో ప్రామాణికత సరిగా ఉండదని అన్నారు. గతంలో దివాకర్ ట్రావెల్స్ బస్సులు జబ్బార్ ట్రావెల్స్ వారికి లీజుకు ఇచ్చామని, అప్పట్లో దగ్ధమైన బస్సు తమ పేరిట ఉన్నందున చనిపోయినవారి కుటుంబాలకు పరిహారం చెల్లించామని అన్నారు.

వెనుకవైపు ద్వారం ఉండాలి..



దూరప్రాంతాలకు రాత్రిపూట ప్రయాణించే ఓల్వో బస్సులకు వెనుకవైపు కూడా డోర్ ఏర్పాటు చేయాలి. బస్సులోకి ఎక్కిన ప్రయాణికులకు ఎమర్జెన్సీ ద్వారం ఎక్కడుందో చూపించాలి. దాన్ని తెరిచే విధానం గురించి నేర్పించాలి. బస్సు తలుపుల వద్ద క్లీనర్ ఉండాలి. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ని ప్రయాణికుల టిక్కెట్‌తోపాటు అందించాలి. ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరిగా ఉండాలి. బస్సుల కిందిభాగాన ఎక్కువ శాతం లగేజీతో నింపేసి ఉంటారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే బస్సు మొత్తం మంటలు వ్యాపిస్తాయి.

- నాగలత, హిందూపురం

దిగ్భ్రాంతికి గురి చేసింది..



బస్సు ప్రమాదం దిగ్భ్రాంతికి గురి చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

-లక్ష్మీనారాయణ, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్


అర్ధరాత్రి.. అతివేగం..



నేను పట్టుచీరల వ్యాపారం చేస్తుంటా. తరచూ వ్యాపారం నిమిత్తం విజయవాడ, హైదరాబాద్, బెంగళూరుకు వెళ్తుంటాను. ఎక్కువగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తుంటాను. అర్ధరాత్రి బస్సులు అతివేగంతో ప్రయాణిస్తుంటాయి. దీని వల్ల మంచి నిద్ర సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. బస్సు కండిషన్ గురించి అధికారులు, యజమానులు పట్టించుకోవడం లేదు. వేగ నియంత్రణపై దృష్టి పెట్టాలి. లేదంటే ప్రమాదాలు కొనసాగుతాయి.

-జింకా పురుషోత్తం, పట్టుచీరల వ్యాపారి, ధర్మవరం

ఓవర్ టేక్‌తోనే ప్రమాదాలు..



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. వారాంతపు సెలవుల్లో స్వగ్రామానికి వచ్చి వెళుతుంటాను. ప్రైవేటు బస్సులలో టిక్కెట్ ధర ఎక్కువ. కానీ అందుకు తగ్గట్టు వసతులు, భద్రత ఉండవు. ఓవర్ టేక్ చేసే క్రమంలో అతివేగంగా బస్సులు నడుపుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి, ప్రయాణికుల భద్రతకు చర్యలు చేపట్టాలి.

-ప్రకాశ్, కొత్తచెరువు

క్రైం కార్నర్

అప్పుల మగ్గానికి మరో నేతన్న బలి



నాగరాజు (ఫైల్)

బత్తలపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అప్పుల మగ్గం నేతన్నలను కబళిస్తోంది. గురువారం ధర్మవరంలో చేనేత కార్మికుడు రాజేశ్ మగ్గానికి ఉరేసుకున్న ఘటనను మరువకనే తాజాగా మండలంలోని పోట్లమర్రిలో నాగరాజు (30) మగ్గానికి వేలాడాడు. అప్పుల బాధ భరించలేక శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకుని, మరణించాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు సొంత మగ్గం నేసుకుంటూ జీవనం సాగించేవాడు. మగ్గం గిట్టుబాటు కాక అప్పులపాలయ్యాడు. వాటిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి భారీ వర్షం కురుస్తుండడంతో భార్య లక్ష్మి, కుమారులు మణికంఠ, గణేష్.. అదే ఊరిలోని అత్తగారి ఇంటికి పంపాడు. తెల్లవారుజామున ఇంట్లోనే మగ్గానికి ఉరేసుకున్నాడు. కుమారులు మణికంఠ, గణేష్ వచ్చి తలుపులు కొట్టగా ఎంతసేపటికీ తీయలేదు. వారు వెళ్లి తల్లి లక్ష్మికి విషయం తెలిపి బంధువులతో కలిసి వచ్చారు. తలుపులు బద్దలు కొట్టి చూడగా నాగరాజు మగ్గానికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నేతన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మోసగించిన ప్రేమికుడి అరెస్ట్

శింగనమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిని శింగనమల పోలీసులు అరెస్టు చేశారు. శింగనమల పోలీస్‌స్టేషన్‌లో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో యువకుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని సోదనపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు హరిప్రసాద్ అలియాస్ హర్షవర్ధన్ మాయమాటలతో బాలికకు దగ్గరయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెను మోసం చేశాడు. దీనిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శుక్రవారం ఆ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

హత్య కేసులో జీవిత ఖైదు

అనంతపురం క్రైం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కళ్యాణదుర్గం మండలం మారంపల్లి కాలనీకి చెందిన బోయ రాజశేఖర్‌కు జీవిత ఖైదు పడింది. మరో రూ.2 వేలు జరిమానా కూడా విధిస్తూ అనంతపురం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. కళ్యాణదుర్గం మండలం మారంపల్లి కాలనీకి చెందిన తలారి నాగరాజు, తన స్నేహితులైన చాకలి అంజి, బోయ రాజశేఖర్‌తో కలిసి 2020 జులై 19న జూదం ఆడుతూ డబ్బు విషయంలో గొడవపడ్డారు. బోయ రాజశేఖర్ దాడి చేయడంతో తలారి నాగరాజు తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో పడిపోయాడు. బాధితున్ని అనంతపురం జీజీహెచ్‌కు తరలించగా, మరుసటి రోజు మరణించాడు. మృతుడి భార్య తలారి ఉష ఫిర్యాదు మేరకు అప్పటి కళ్యాణదుర్గం రూరల్ సీఐ శివశంకర్ నాయక్ దాడి చేసిన బోయరాజశేఖర్‌పై హత్య కేసు నమోదు చేశారు. తర్వాత సీఐగా వచ్చిన తేజోమూర్తి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. సుమారు 10 మంది సాక్షులను విచారించగా, నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో న్యాయాధికారి బోయ రాజశేఖర్‌కు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై పోక్సో కేసు

గార్లదిన్నె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన అశోక్ గార్లదిన్నెలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గార్లదిన్నె సమీపంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడి చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో శుక్రవారం తలగాసిపల్లి జంక్షన్ వద్ద ఉన్న అశోక్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో ఇద్దరు జవాన్ల మృతి



అమర్‌నాథ్ (ఫైల్)

పెద్దవడుగూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనారోగ్యంతో బాధపడుతూ ఇద్దరు జవాన్లు శుక్రవారం మృతిచెందారు. పెద్దవడుగూరు మండలంలోని అప్పేచర్ల గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాను అమర్‌నాథ్ (42) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకోగా.. తీవ్ర తలపోటు రావడంతో కుటుంబ సభ్యులు డిఫెన్స్ ఆస్పత్రికి తరలించారు. తలలో రక్తనాళాలు గడ్డ కట్టడంతో గురువారం రాత్రి మరణించారు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి, ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జవాను మృతదేహం వద్ద తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి నివాళులు అర్పించారు. జవానుకు భార్య సుకన్య, కుమారుడు తిమ్మీస్, కుమార్తె దీపిక ఉన్నారు.



శామ్‌ప్రసాద్ (ఫైల్)

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన జవాను శ్యామ్‌ప్రసాద్(35) శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ, లక్ష్మీదేవమ్మల పెద్దకుమారుడు వెంకటనాయుడు జమ్మూ కశ్మీర్‌లో బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు శ్యామ్‌ప్రసాద్ ఆర్మీలో పంజాబ్‌లో పనిచేస్తున్నాడు. సెప్టెంబరు 6న దసరా పండగకు శెట్టిపల్లికి వచ్చాడు. అక్టోబరు 6న తిరిగి విధుల్లో చేరాడు. వారం రోజుల కిందట జ్వరం రాగా పంజాబ్‌లోని జలంధర్ ఆర్మీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం 12.30కు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.మృతుడికి భార్య శ్రావణి, ఇద్దరు కుమారులున్నారు.

రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యం

- హంద్రీనీవాకు నిధులిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు
- హెచ్ఎన్ఎస్ఎస్‌కు 50టీఎంసీల నీరు రాబట్టాలి
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- తారతమ్యాలు లేకుండా నీటి కేటాయింపులు: కలెక్టర్
- ఐఏబీ సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యేల చర్చ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో సాగు నీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐఏబీ చైర్మన్, కలెక్టర్ ఆనంద్ అధ్యక్షత న నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్‌కి నిధులు కేటాయించి పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతాంగం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపారు. వందరోజుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులు పూర్తి చేయడం అద్భుతమని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను అభినందించారు. టీబీ డ్యాంలో నీటి నిల్వ తగ్గినా హెచ్చెల్సీకి కేటాయించిన నీటిని తీసుకోవాలని, శ్రీశైలం డ్యాంనుంచి ఈ దఫా హంద్రీనీవాకు 50టీఎంసీల నీటిని రాబట్టడమే లక్ష్యంగా ఇంజనీర్లు పనిచేయాలని కోరారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించినప్పుడే రైతుల విశ్వాసాన్ని చూరగొనగలమన్నారు. సాగు చేసిన పంట ఇంటికి చేరే వరకు అన్నదాతకు అండగా ఉంటామన్నారు. నీటి కేటాయింపులు, నిర్వహణకు ఇంజనీర్లు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 40ఏళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా నీటి కేటాయింపులు జరగడంపై ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేయడం ఇదే తొలిసారన్నారు. ఇదంతా సీఎం చంద్రబాబు చొరవతోనే సాధ్యమైందని తెలిపారు. హంద్రీనీవాకు రూ.3800 కోట్లు నిధులు కేటాయించి కాలువ వెడల్పు, లైనింగ్ పూర్తి చేయడం చంద్రబాబుకు రైతులపై ఉన్న నిబద్ధత, అభిమానానికి నిదర్శనమని కొనియాడారు. నీటి క్యాలెండర్‌ను రూపొందించి ప్రతి ఏటా నిర్దిష్టమైన కార్యాచరణను అమలు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి దూర దృష్టితోనే ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందుతోందని హర్షం వ్యక్తం చేశారు.
- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యవసాయానికి హంద్రీనీవా కాలువ వెడల్పు అత్యవసరమని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈక్రమంలోనే నిధులు కేటాయించి, పనులు పూర్తి చేసిందన్నారు. ఇందుకోసం చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కళ్యాణదుర్గంలోని చెరువులను హెచ్చెల్సీ హంద్రీనీవా నీటితో నింపాలని కోరారు.
- శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ మాట్లాడుతూ ఎంపీఆర్ ఆధునికీకరణ, గేట్ల మరమ్మతులకు రూ.5.5కోట్లు నిధులు ఇచ్చి, ఆయకట్టుకు 150రోజులపాటు సాగునీటి సరఫరాకు సహకరించిన సీఎం చంద్రబాబు, ఆర్థికమంత్రికి నియోజకవర్గ రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు శింగనమల చెరువుకు ఒక టీఎంసీల నీరు ఇవ్వాలని కోరారు.
- తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నడూలేనివిధంగా తాడిపత్రి నియోజకవర్గానికి సాగు నీరు కేటాయించి, సరఫరా చేస్తున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సౌత్‌కెనాల్ మరమ్మతుకు అవసరమైన నిధులు కేటాయించి అదనంగా 20వేల ఎకరాల ఆయకట్టు సాగుకు సహకరించాలని కోరారు. శిథిలావస్థకు చేరిన డిస్ట్రిబ్యూటరీల పటిష్టం చేయాలని పేర్కొన్నారు.
- అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని రుద్రంపేట, రూరల్, రాజీవ్‌కాలనీ, నారాయణపురం గ్రామ పంచాయతీలతో పాటు ఇతర పంచాయతీలకు తాగునీరు కేటాయించాలని కోరారు. నడిమివంక రక్షణ గోడ నిర్మాణానికి మైనర్ ఇరిగేషన్ ద్వారా నిధులు ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో నడిమివంక ప్రభావంతో కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.
- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ.. ఐఏబీ సమావేశం మూడు నెలలు ఆలస్యంగా నిర్వహించడంతో నీటి కేటాయింపులు, విడుదల తేదీల జాప్యంతో రైతులకు నష్టం జరుగుతోందని తెలిపారు. పీఏబీఆర్ పూర్తి సామర్థ్యం 11.6టీఎంసీల నీటి నిల్వకు అవసరమైన భూసేకరణ వెంటనే చేపట్టాలన్నారు. అటు హెచ్చెల్సీ, ఇటు హంద్రీనీవాలకు కలిపి అదనంగా జిల్లాలో ఓ రిజర్వాయర్‌ను నిర్మించాలన్నారు. లస్కర్ పోస్టులను భర్తీ చేసి, ఇరిగేషన్‌కు నిధులు కేటాయింపులు పెంచాలన్నారు. హంద్రీనీవా వెడల్పు, లైనింగ్‌కు నిధులు కేటాయించి పూర్తి చేయడం అభినందనీయమన్నారు.
- జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ కాలువల మీద విధులు నిర్వహించి, నీటిని కాపాడే లస్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కాలవల నుంచి నీరు వృథా కాకుండా అరికట్టి, రైతుల పంటలను కాపాడాలని తెలిపారు.
- జిల్లా కలెక్టర్, ఐఏబీ చైర్మన్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాకు ప్రధాన నీటి వనరులు అయిన హంద్రీనీవా, హెచ్చెల్సీ ప్రాజెక్టుల పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి నీటి కేటాయింపులలో ఎటువంటి తారతమ్యాలు లేకుండా లెక్కలు సరిచేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం అధికారులను సమన్వయం చేసుకుని ముందుకెళ్తామని తెలిపారు.
- జలవనరుల ప్రాజెక్టుల సీఈ నాగరాజ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్, హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్ రావు, టీబీ డ్యాం ఎస్ఈ నారాయణనాయక్‌లు నీటి కేటాయింపులు, విడుదల తేదీలతో పాటు చేసిన పురోగతి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్చెల్సీ ప్రాజెక్ట్ చైర్మన్ జోగిరెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, హంద్రీనీవా, హెచ్చెల్సీ ఎంఐ ఈఈలు, డీఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.



ఐఏబీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

చిలకం మధుకి భద్రత కల్పించండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి భద్రత (1+1) కల్పించాలని గురువారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. చిలకం మధుసూదన్‌రెడ్డి కుటుంబ నేపథ్యం, రాజకీయ హోదాను దృష్టిలో ఉంచుకుని 2020 జూలై 22న ప్రభుత్వం (1+1) భద్రత కల్పించింది. తరువాత రాజకీయ కక్షతో అదే ఏడాది సెప్టెంబరు 15న భద్రతను తొలగించారు. అప్పట్లో హైకోర్టును ఆశ్రయించగా.. ప్రభుత్వం భద్రతను కొనసాగించాలని ఆదేశించింది. తరువాత రాజకీయ కక్షతో 2021 నవంబరు 23న భద్రతను తొలగించారు. దీంతో భద్రతను కొనసాగించేలా పోలీసులను ఆదేశించాలని చిలకం మధుసూదన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి, దాఖలు చేశారు. గురువారం ఈ కేసు విచారణ చేపట్టిన జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయ ప్రతాప ఆధ్వర్యంలోని ఏకసభ్య ధర్మాసనం చిలకం మధుసూదన్‌రెడ్డికి (1+1) వ్యక్తిగత భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు. చిలకం మధుసూదన్‌రెడ్డి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నవంబరు, డిసెంబరు నెలల్లో గుంతకల్లు మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య వారానికి రెండు రోజుల (బైవీక్లీ) ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (06539) ప్రత్యేక రైలును నవంబరు 2 నుంచి డిసెంబరు 28 వరకూ శుక్ర, ఆదివారాలలో 17 ట్రిప్పులను నడుపుతామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06540)ను నవంబరు 3 నుంచి 29 వరకూ ప్రతి శని, సోమవారాల్లో 17 ట్రిప్పులను నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహాబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

జవాబుదారీగా పని చేయాలి: డీఆర్ఎం

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచేయాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో శుక్రవారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించారు. నైతికతను కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని డీఆర్ఎం సూచించారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ వెల్లడించారు. తెలిపారు. ఎంపికైన జట్టులో పృథ్వీరాజ్, జగదీష్, మహేష్, సింహాద్రి, తరుణ్‌సాయి, సాయివెంకట్, లక్ష్మీకళ్యాణ్, లక్ష్మీనారాయణ, వినోద్, అరవింద్‌రెడ్డి, జయవర్ధన్ చౌదరి, ప్రశాంత్, సాయి జస్విక్‌రెడ్డి, అక్షయసాగర్, సాయివినయ్, వరుణ్ ఉన్నారు. స్టాండ్‌బైలుగా జయచంద్ర, మోక్షిత్‌వర్మ, బానుశంకర్, అరవింద్, సతీష్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరు నవంబరు 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీ ప్రభాకర్, ప్లేయర్ నాగేంద్ర పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత

పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సుకన్య సమృద్ధియోజన ద్వారా పేద విద్యార్థినులకు ఆర్థిక చేయూత అందించనున్నట్లు డీఈఓ క్రిష్టప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం శ్రీసత్యసాయిజాతీయసేవా ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ శశిబాల ఆధ్వర్యంలో ఖాతాలు తెరవడానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎస్సీ ఎస్టీ బీసీ పేద విద్యార్థినులను గుర్తించి వారిఖాతాల్లో కొంతమేర సొమ్మును ప్రభుత్వం జమ చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, తపాలా సిబ్బందికి విద్యార్థినుల (పదేళ్లలోపు బాలికలు) ఆధార్, తరగతి వివరాలను అందచేయాలన్నారు.

రేపు వాల్మీకి, బోయ టీచర్లకు సత్కారం

అనంతపురం విద్య, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉద్యోగాలు సాధించిన వాల్మీకి, బోయ టీచర్లకు ఈనెల 26న ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేసినట్లు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్ తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ తీవ్ర పోటీ ఉన్న డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం వాల్మీకి బిడ్డలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. అందుకే వాల్మీకి కులబంధువుల సమక్షంలో సత్కరించాలనే ఈ ఆత్మీయ సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్జీఓ హోమ్‌లో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

ఏడాదికో దూడ చాలు

- పాడి రైతులకు జేడీ సూచన

శింగనమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఏడాదికో దూడ అనే నియమాన్ని పాటిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు (జేడీ) ప్రేమ్‌చంద్ సూచించారు. దూడలు కూడా బాగా ఎదుగుతాయన్నారు. మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. జేడీ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ.. పాడిరైతులు తమ పశువులు ఈనిన 60 రోజుల్లోపే తిరిగి కట్టించాలని చూస్తున్నారన్నారు. తద్వారా పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. ఎస్ఎస్ఎస్ వీర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామనీ, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్, రమేష్‌రెడ్డి, పద్మనాభయ్య, కిరణ్‌కూమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నత్తల నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమడగూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ సమీపంలోని గొల్లపల్లి పరిధిలో నత్తల నివారణకు అధికారులు కదిలారు. అవి పంటలను దెబ్బతీస్తున్న విధానంపై 'నత్తల దండు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. శుక్రవారం ఉద్యాన శాఖాధికారి లావణ్య ఆధ్వర్యంలో పొలాలను పరిశీలించారు. నత్తల నివారణకు 250 గ్రాముల కాపర్ సల్ఫేట్, ఫెర్రస్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి, ఎకరానికి పిచికారీ చేయించారు. ఈ ద్రావణానిన డ్రిప్ ద్వారా కూడా సరఫరా చేసుకోవచ్చని ఉద్యాన శాఖాధికారి సూచించారు. పొలం చుట్టూ రాళ్ల ఉప్పు వేస్తే పంటలోకి నత్తలు చొరబడకుండా నివారించవచ్చన్నారు. పొలం చుట్టూ బొప్పాయి మొక్కలు పెంచితే వీటి ప్రభావం పంటపై ఉండదన్నారు. పంటలో కొన్నిచోట్ల బొప్పాయి ఆకులను ఏర్పాటుచేస్తే నత్తలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటరమణాచారి, సిబ్బంది బాబ్‌జాన్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది వెంకటేష్, రవి పాల్గొన్నారు.

కూతురిపై తల్లి విజయం

ఆదరించనందుకు భూమిని తిరిగి పొందిన లక్ష్మమ్మ

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి.. భూమిని రాయించుకుని.. ఆ తర్వాత పట్టించుకోని కూతురిపై అమ్మ గెలిచింది. దాన విక్రయం కింద కూతురికి రాసిచ్చిన భూమిని రెవెన్యూ కోర్టు ద్వారా తిరిగి పొందింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని లోనికోటకు చెందిన గుంజర లక్ష్మమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె లక్ష్మీదేవికి 596-1 సర్వే నంబరులో 59.50 సెంట్ల స్థలాన్ని లక్ష్మమ్మ దాన విక్రయం చేసింది. కొన్ని రోజులు లక్ష్మీదేవి.. తల్లిని బాగా చూసుకుంది. ఆ తరువాత పట్టించుకోలేదు. దీంతో లక్ష్మమ్మ తీవ్ర ఇబ్బందులు పడింది. ఆర్డీఓ కోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఫిర్యాదు చేసింది. దానిని సీరియస్‌గా తీసుకున్న ఆర్డీఓ మహేశ్.. లక్ష్మమ్మ కుటుంబ సభ్యులతో పలుమార్లు విచారణ చేపట్టారు. లక్ష్మమ్మను కుమార్తె లక్ష్మీదేవి ఇబ్బందులు పెట్టింది వాస్తవమేనని తేలింది. దీంతో కుమార్తె లక్ష్మీదేవికి దాన విక్రయం చేసిన స్థలాన్ని రెవెన్యూ కోర్టుద్వారా తిరిగి లక్ష్మమ్మకు అప్పగిస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం లక్ష్మమ్మకు అందజేశారు.



స్థలాన్ని తిరిగి లక్ష్మమ్మకు అప్పగిస్తూ ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్డీఓ

క్యాంపు రాజకీయం..!

బీకేఎస్ ఎంపీపీపై అవిశ్వాసం నేపథ్యంలో ఉత్కంఠ

వైసీపీ శిబిరానికి ఓ ఎంపీటీసీ డుమ్మా

ఓ సభ్యుడి కిడ్నాప్ కలకలం..!



బుక్కరాయసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. శిబిరానికి ఓ ఎంపీటీసీ గైర్హాజరవడం, మరో సభ్యుడిని కిడ్నాప్ చేశారంటూ ప్రచారం నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎంపీపీ పీఠం దక్కించుకునేందుకు ఇటు వైసీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్, ఇటు ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ నెల 30న బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీతపై వైసీపీ నేతలు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. ఇప్పటికే 12 మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులను శిబిరానికి తరలించినట్లు సమాచారం. మద్దతు కూడగట్టేందుకు వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

13 మంది మద్దతు అవసరం

మండలంలో మొత్తం 19 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 13 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్నికల్లో 14 ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అప్పటి ఎమ్మెల్యే పద్మావతిపై అసంతృప్తితో ఎంపీపీ సునీత.. ఎన్నికలకు ముందు టీడీపీలోకి చేరారు. అందుకు టీడీపీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమెతో పార్టీకి సంబంధంలేదని టీడీపీ జోనల్ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర ఎన్నికలకు ముందు ప్రకటించారు. అయినా ఆమె.. పార్టీలో పరోక్షంగా పనిచేశారు. దీంతో ఆమెను కొనసాగించేందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పట్టుబట్టారు. వైసీపీ సభ్యులు 13 మంది ఉన్నారు. టీడీపీ సభ్యులు ఐదుగురు, ఎంపీపీతో కలిసి బలం ఆరుకి చేరుతుంది. ఎంపీపీ సునీతను టీడీపీకి చెందిన కొందరు ఎంపీటీసీలు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. సునీత కాకుండా వేరెవ్వరికైనా మద్దతు ఇస్తామని ఒకరిద్దరు చెబుతున్నట్లు తెలుస్తోంది. బుక్కరాయసముద్రం వైసీపీ ఎంపీటీసీ-3 శిరిజ ఆ పార్టీ శిబిరానికి డుమ్మా కొట్టారు. ఆమె ఆచూకీ కోసం వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. 30న జరిగే సమావేశానికి గైర్హాజరు చేసేందుకు ఎంపీపీ దాసరి సునీత తీవ్ర పయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వైసీపీ ఎంపీటీసీలను కలిసి, మద్దతు కోరినట్లు సమాచారం.

కిడ్నాప్ కలకలం

మండలంలోని కేకే ఆగ్రహారం ఎంపీటీసీ రామచంద్రను కిడ్నాప్ చేసినట్లు గురువారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన సీఐ పుల్లయ్య, సిబ్బంది ఎంపీటీసీ రామచంద్రను స్టేషన్‌కు పిలిపించి, విచారించారు. రాత్రి 12 గంటల వరకు స్టేషన్‌లో విచారణ చేయడంతో వైసీపీ శిబిరంలో ఆందోళన మొదలైంది. తిరిగి వైసీపీ ముఖ్యనేతలు.. రామచంద్రతో మాట్లాడారు. అనంతరం తనను కిడ్నాప్ చేయలేదని రామచంద్ర చెప్పడంతో పోలీసులు పంపించేశారు. వైసీపీ శిబిరంలోకి వెళ్లినట్లు తెలిసింది.

న్యూస్ బాక్స్

అక్రమ లే అవుట్లలో నిర్మాణాలు చేయొద్దు



అక్రమ లేఅవుట్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి

నంబులపూలకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు చేపట్టరాదని డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల సమీపంలో అక్రమ లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు జరుగుతున్న విషయం తెలుసుకొని శుక్రవారం పరిశీలించారు. అహుడా అనుమతి లేకుండా లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేశారని అన్నారు. పలుమార్లు అనుమతులు లేని లేఅవుట్లలో ఇంటి స్థలాలకు కొనుగోలు చేయరాదని సూచించామన్నారు. ఇంటి నిర్మాణాలు చేపడితే పంచాయతీ అనుమతి ఇవ్వదని, నీటి కొళాయిలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించేదిలేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా లేఅవుట్లు వేసిన వారు రెగ్యులర్ స్కీం కింద దరఖాస్తు చేసుకొని అహుడా అనుమతి తీసుకోవాలన్నారు.

సేవే 'మానవత' లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మానవత వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి

నంబులపూలకుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు సేవ చేయడమే మానవత సంస్థ లక్ష్యమని వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన మానవత కార్యాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా మంది పిల్లలు విదేశాలలో ఉండడం వల్ల తల్లిదండ్రులకు ఆలనా పాలనా కరువయిందని అన్నారు. మృతదేహాలకు కావాల్సిన ఫ్రీజర్లను ఉచితంగా సరఫరా చేస్తామని అన్నారు. చనిపోయిన వారి బంధువుల చివరిచూపునకు ఇవి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, కమిటీ ముఖ్యులు రాఠాల గోపీ, రామాంజులరెడ్డి, వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ దేవేంద్రనాయక్, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, ఎంఈఓ సుబ్బిరెడ్డి, ఎస్ఐ వలీబాషా, బ్యాంక్ మేనేజర్ పిచ్చయ్య, మహేశ్వర్ రెడ్డి, గంగిరెడ్డి, దండే రవిశంకర్, శివారెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తనకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటూరు సమీపంలో శుక్రవారం సాయంత్రం నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు తనకల్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారి వద్దనుంచి రూ. 2,450 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. మండలంలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కదిరి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు మెమో 57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004 సెప్టెంబరుకు ముందు నియామక ప్రక్రియ ప్రారంభించిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఇది వరకే అన్ని రాష్ట్రాలు 2004 సెప్టెంబరుకు ముందు నియామకం పొం దిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేశారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో మాత్రం కాలయాపన చేస్తున్నారని అన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాదరెడ్డి, జవహర్, రామాంజనేయులు, ఫయాజ్, కరుణాకర్, రత్నం పాల్గొన్నారు.

నీటి వాడకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్ఈఎస్ సంస్థ ప్రతినిధి హేమలత

తనకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నీటి వాడకంపై రైతులు, గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ (ఎఫ్ఈఎస్) సంస్థకు చెందిన హేమలత పేర్కొన్నారు. మండల పరిధిలోని మార్పురివాండ్లపల్లిలో శుక్రవారం జనజాగృతి ఆధ్వర్యంలో వాటర్‌గేమ్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు, మహిళలు బృందాలుగా విడిపోయి వాటర్ గేమ్స్‌లో పాల్గొన్నారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ఎన్ని నీళ్ల అవసరమవుతాయో, తమ వద్ద ఏడాది పొడవునా ఎంత వర్షపాతం నమోదయిందో, ఎన్నిరకాల పంటలు సాగుచేస్తున్నారో, పశువులు, మనుషులు తాగడానికి అవసరాలకు ఎంత నీటిని ఉపయోగిస్తున్నామో వివరించారు. కార్యక్రమంలో జనజాగృతికి చెందిన చంద్రమోహన్, గరుడప్ప, గంగాధర్‌రెడ్డి, మార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి, కూరుమాలపల్లి, చిన్న,పెద్ద ఎద్దులవారిపల్లి గ్రామాలకు చెందిన రైతులు, మహిళలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీని అమలు చేయాలి

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాణిజ్య దుకాణాలలో వ్యాపారులు తగ్గించిన జీఎస్టీని అమలు చేయడంలేదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఇడగొట్టు వీరాంజనేయులు ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కిరాణా, మందుల దుకాణం, ఫర్టిలైజర్స్‌లలో పాతరేట్లకే అమ్ముతున్నారని తెలిపా రు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని అమలు పరచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, కిష్టప్ప, అంజినప్ప, లక్ష్మీనారాయణ, నాగప్ప, రాజశేఖర్, చంద్రారెడ్డి, అశ్వర్థప్ప, తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఎడా పెడా విద్యుత్ కోతలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
● ఉప్పునేసినపల్లి వాసుల ఆవేదన



విద్యుత్ సమస్యను వివరిస్తున్న ఉప్పునేసినపల్లి వాసులు

ధర్మవరంరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎడా పెడా విద్యుత్ కోతలతో సతమతమవుతున్నామని మండలంలోని ఉప్పునేసినపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. కాస్త వర్షం వచ్చినా విద్యుత్ ఉండదని, బోరుబావులకు సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రతిరెండు మూడురోజులకు కరెంట్ కోతలతో అవస్థలు పడుతున్నామని తెలిపారు. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గ్రామస్థులు మాట్లాడుతూ.. తమ గ్రామం ఫీడర్‌కు సంబంధించి బోరుబావులకు, ఇళ్లకు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోందని అన్నారు. లైన్‌మ్యాన్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, మండల విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో ప్రతిరోజు విద్యుత్‌సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోందని గ్రామస్థులు రామ్మోహన్‌నాయుడు, బొల్లినేని నాయుడు, శివనాయుడు, యుగంధర్, సూరి, ముత్యాల్‌నాయుడు, మాధవయ్య, బయన్న, నాగేంద్ర, రాజశేఖర్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పార్టీని భ్రష్టు పట్టిస్తున్న మక్బూల్

● నిరాశలో కార్యకర్తలు
● వైసీపీ సమన్వయకర్తపై తలుపుల నాయకుడి ఆగ్రహం



మాట్లాడుతున్న వైసీపీ మండల మాజీ కన్వీనర్ ఫయాజ్

కదిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీని కదిరి నియోజక వర్గ సమన్వయకర్త మక్బూల్ బాషా భ్రష్టు పట్టిస్తున్నాడని ఆ పార్టీ తలుపుల నాయకుడు ఫయాజ్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం తలుపులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. వైసీపీ మండల మాజీ కన్వీనర్ ఫయాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. వైసీపీ నియోజవకర్గ సమన్వయకర్త మక్బుల్ పార్టీని గబ్బుపట్టిస్తున్నాడని, డ్యామేజ్ చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట మా త్రం కూడా చెప్పకుండా హఠాత్తుగా మండల కన్వీనర్‌ను మారుస్తున్నట్లు చెప్పడం చూస్తే వింతగా ఉందని అన్నారు. ఈ మార్పు చూస్తుంటే ఆయన స్వాతిముత్యంలో కమలహాసన్‌లా కనిపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. పార్టీలో సీనియర్ నాయకుడయిన తనకు కన్వీనర్ మార్పు గురించి మాట మాత్రం కూడా చెప్పకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన నిర్ణయాల వల్ల ఇప్పటికే కదిరి మున్సిపాలిటీ చేజారిపోయిందని అన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నారని తెలిపారు. 'కన్వీనర్‌ను హ ఠాత్తుగా మార్పు చేయడానికి ఇదేమైనా కువైట్, సౌదీ, అరేబియా అనుకున్నావా.. ఇది భారతదేశం.. ఇక్కడ రాజ్యాంగం ఉంది దాన్ని గౌరవించాలి' అని అన్నారు. తా ను సర్పంచ్‌గా తలుపులను అభివృద్ధి చేశాననీ, గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు వద్దే అవార్డు తీసుకున్నానని గుర్తు చేశారు. నియోజకవర్గ సమన్వయకర్తగా అందరిని సమన్వయం చేస్తూ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. లేకపోతే పార్టీ దెబ్బతింటుందని తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



గెలుపొందిన విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు బహుమతులు ప్రదానం చేశారు. నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ప్రదానం చేశారు. పోటీల్లో బీఎస్ఆర్ బాలికల ఉన్నతపాఠశాలలో చదువుతున్న సుమీయ, బీఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థి జస్వంత్, శాంతినగర్ ఉన్నతపాఠశాలకు చెందిన గణేశ్ ప్రతిభ కనబరచినట్లు ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ తెలిపారు. వీరు త్వరలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు కుల్లాయప్ప, శ్రీనివాసులు, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

3 తులాల బంగారం, సెల్‌ఫోన్ చోరీ

ధర్మవరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుంపర్తి కాలనీలో అనూష అనే మహిళ ఇంట్లో చోరీ జరిగినట్లు శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనూష ఓ ప్రైవేటు స్కూల్ ఆయాగా పనిచేసుకుని జీవనం సాగిస్తోంది. ఆమె గురువారం తన పుట్టినిల్లు ధర్మవరంలోని శాంతినగర్‌కు వెళ్లింది. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఆమె హుటాహుటినా ఇంటికి చేరుకుని చూడగా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం చైను, సెల్‌ఫోన్‌ను చోరీకి గురైనట్లు గుర్తించి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వడ్డెర్ల సమావేశం

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకటసాయి కళాశాలలో శనివారం ఉదయం 11 గంటలకు వడ్డెర్ల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకులు పీట్ల సుధాకర్, వల్లెపు శ్రీనివాసులు, జెరిపిటి అంజినప్ప పేర్కొన్నారు. సమావేశానికి వడ్డెర్లు హాజరు కావాలని కోరారు. సమావేశం అనంతరం కమిటీ ఎంపిక ఉంటుందని నాయకులు పేర్కొన్నారు.

కంటి పరీక్షా కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న జాతీయ అంధత్వ నివారణ సంస్థ అధికారి, వైద్యాధికారులు

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంటి పరీక్షా కేంద్రాలను శుక్రవారం జాతీయ అంధత్వనివారణ సంస్థ అధికారి అనురాధ, మెడికల్ ఆఫీసర్లు తిప్పయ్య, చెన్నారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంటి పరీక్షా కేంద్రాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం రిజిస్టర్ చేసుకున్నారా, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్వహిస్తున్నారా తదితర అంశాలపై నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బుక్కపట్నం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వరి పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య తెలిపారు. బుక్కపట్నంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రామసుబ్బయ్య మాట్లాడుతూ.. వరి పంట పిలకల దశ నుంచి వెన్ను దశ వరకు వచ్చే వ్యాధులను, వాటి నివారణకు సంబంధించిన విషయాలన రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శైల కుమారి, ఏఓ చైతన్య, వ్యవసాయ అధికారి నటరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6.84 కోట్లతో సీసీ రోడ్లు: ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్/కొత్తచెరువు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలుగ్రామాలకు రూ 6.84 కోట్ల నిధులతో 119 సీసీరోడ్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిధులు మంజూరుచేయడంతో ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. 2024లో రూ 8.20 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం తర్వాత ఈ సంవత్సరం పుట్టపర్తి రూరల్‌లో 9 పనులకు రూ కోటి, కొత్తచెరువు మండలంలో 29 పనులకు రూ 1.46 కోట్లు, బుక్కపట్నం మండలంలో 15 పనులకు రూ.కోటి మంజూరయ్యాని తెలిపారు. అదే విధంగా అమడగూరు మండలంలో 26 పనులకు రూ 1.10 కోట్లు, ఓడీసీ మండలంలో 19 పనులకు రూ 1.17 కోట్లు వివరించారు. నల్లమాడ మండలంలో 21 పనులకు రూ. 1.10 కోట్లతో పనులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు పిట్టా ఓబులరెడ్డి, మండల వడ్డెర సంఘం నాయకులు స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని నాలుగు రహదారుల వద్ద స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సాయిరాం, ఆంజనేయులు, వీరాంజి, మస్తానమ్మ, అంజి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

ఈ నెల 26న గోరంట్లలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణకు వడ్డెర కులస్థులు తరలిరావాలని ఆ సంఘం నాయకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆంజనేయులు, చంద్ర, చెన్నకేశవులు, ఆవుల గంగప్ప, శ్రీనివాసులు, ఎంపీటీసీ శ్రీనివాసులు, కేఎఫ్ ఆంజనేయులు ప్రకటన విడుదల చేశారు.

రాయితీ విత్తనాల కోసం ప్రతిపాదనలు

పుట్టపర్తి రూరల్/ కొత్తచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుకోసం 19,520 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రామునాయక్ తెలిపారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచనల మేరకు ఉలవలు, పెసలు, అలసందలు మినుములు విత్తనాల కోసం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు పేర్కొన్నారు.

పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించాలి

ముదిగుబ్బ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తక్షణమే ఆధార్ క్యాంపులు నిర్వహించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం విద్యార్థులు తరచూ పాఠశాలలకు సెలవు పెట్టి తల్లిదండ్రులతో కలిసి మీసేవ, ఇంటర్నెట్ సెంటర్లకు వెళుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తోందన్నారు. ముదిగుబ్బ మండలంలో అధికారుల నిర్లక్ష్యంతో ఈ క్యాంపులు ఏర్పాటు చేయకపోవడం దారుణం అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వినియోగదారుల హక్కులను కాపాడాలి: జేసీ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వినియోగదారుల రక్షణ మండలి అధికారులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న వినియోగదారుల సంఘ సభ్యులు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. వినియోగదారులు ఎలాంటి మోసాలకు గురికుండా చూడాలని తెలిపారు. బంగారు కొనుగోలు చేసేటప్పుడు, రైతులు విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు కొన్నప్పుడు జరిగే మోసాలను తూనికలు, కొలతల శాఖ సిబ్బంది విరివిగా తనిఖీలు నిర్వహించి అరికట్టాలన్నారు. నూనెలు, కారంపొడులు, డెయిరీ ఉత్పత్తులలో కల్తీ జరగకుండా ఆహార భద్రత శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఔషధ మందుల దుకాణాల్లో అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ధర్మవరం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు

ధర్మవరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ధర్మవరం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో రైల్వే సంవాద్ కార్యక్రమంలో భాగంగా సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్, సీనియర్ డివిజనల్ ఇంజనీరింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై స్టేషన్ కన్సల్టెన్సీ మెంబర్లతో సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ నరసింహనాయుడు మాట్లాడుతూ.. ధర్మవరం రైల్వేస్టేషన్‌ను అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్స్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు, డాక్టర్ నరసింహులు, బండి రాము, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, రిటైర్డ్ కమర్షియల్ సూపరింటెండెంట్ మనోహర్ గుప్తా రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంపీరియల్ గార్డెన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



ఇంపీరియల్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని గట్లు వద్ద ఇంపీరియల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. పట్టణానికి సమీపంలో ఫంక్షన్‌హాల్, లాడ్జ్, స్విమ్మింగ్ పూల్, రిసార్ట్స్ వంటి సౌకర్యాలు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అహ్లాదకరమైన వాతావరణంలో వీటిని నిర్మించినట్లు చెప్పారు.

9న బీజేపీ ఆత్మీయ సమావేశం



పోతుల సురేష్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

బుక్కపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో నవంబరు 9న ఆత్మీయ సమావేశంలో నిర్వహించనున్నట్లు పోతుల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బుక్కపట్నంలో సమావేశం నిర్వహించారు. నవంబరు 9న నిర్వహించే సమావేశానికి మిత్రులు, ఆత్మీయులు, అనుచరులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

సచివాలయానికి దారి కష్టాలు



వర్షానికి బురదమయమైన రహదారి

నల్లచెరువు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గురువారం కురిసిన వర్షానికి పలు రహదారులు అధ్వానంగా మారాయి. నల్లచెరువులోని జెండా వేపమాను వద్ద రహదారి జలమయం కావడంతో సచివాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో పాటు రహదారికి సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోననీ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సచివాలయానికి వెళ్లే దారికి మట్టి తోలించి కనీసం గుంతలైన పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు క్రీడాసామాగ్రిని పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివానగర్ ప్రాథమిక ఉన్నతపాఠశాల విద్యార్థులకు శుక్రవారం టీడీపీ నాయకులు క్రీడాసామగ్రిని పంపిణీచేశారు. పాఠశాల హెచ్ఎం రామేశ్వరరావు రెండు నెలలక్రితం మీ సమస్యమా బాధ్యత కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు క్రీడాసామాగ్రిలేక ఇబ్బందులు పడుతున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఆదేశాల మేరకు శివానగర్ శివాలయ అభివృద్ధికమిటీ చైర్మన్ దాసరి రంగయ్య రూ.10వేల విలువైన క్రీ డాసామాగ్రిని సమకూర్చారు. వాటిని టీడీపీ నాయకులు పరిశేసుధకర్, రంగయ్య, రవీంద్ర, శివశంకర్ పంపిణీచేశారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని అక్కెమియాపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సమాచార హక్కు ప్రజా చైతన్యవేదిక రాష్ట్ర కన్వీనర్ అబీబుల్ రెహమాన్, డివిజన్ అధ్యక్షుడు అయాజ్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. వీటితో పాఠశాలకు ఫ్యాన్‌లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ హనీఫ్, సీఆర్ఎంటీ అన్వర్‌అలీ, ప్రధానోపాధ్యాయుడు గౌల్‌లాజం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పోరంబోకు స్థలాన్ని పంచాయతీకి అప్పగించండి



రీసర్వే డీటీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోరంబోకు భూమిలో ఉన్న 15సెంట్ల స్థలాన్ని పంచాయతీకి అప్పగించాలని టీడీపీ నాయకులు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌కు విన్నవించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ నాయకులు సర్వేనంబరు 711, 726లో 15సెంట్ల స్థలం ఖాళీగా ఉందని ఇదివరకే సర్వే చేపట్టారన్నారు. పంచాయతీ అభివృద్ధి కోసం వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. ఇదివరకు సర్వేచేపట్టి రాళ్లు పాతగా భూ యజమానులు రాళ్లను తొలగించి సేద్యం పనులు చేశారన్నారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు, సిద్దన్న, శంకర్, చెన్నకేశవులు, చిరంజీవి, రామక్రిష్ణ, కిష్టప్ప, రుద్రప్రసాద్, రామాంజి పాల్గొన్నారు.

రాజ్యాల లక్ష్యం ప్రపంచ శాంతి కావాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయప్ప

పెనుకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాల లక్ష్యం అంతర్జాతీయ శాంతి అయి ఉండాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయప్ప అన్నారు. శుక్రవారం స్థానిక పరిటాల డిగ్రీకళాశాలలో రాజనీతిశాస్త్రం, చరిత్ర సంయుక్తంగా ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ఆధునిక విజ్ఞాన యుగంలో రాజ్యాల మధ్య అంతరం తొలగి యుద్ధ వాతావరణం నెలకొనకుండా చూడాలన్నారు. ఐక్యూ కోఆర్డినేటర్ యశోధరాణి, అధ్యాపకులు కాంతారావు, ప్రతాప్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న రాజీవ్‌లోచన్

మడకశిర రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి బాలికల క్రీడాపోటీలు శుక్రవారం ప్రారంభమైనట్లు ప్రకాష్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ విజయకుమారి తెలిపారు. వారు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న అండర్-14, అండర్-17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాజీవ్‌లోచన్ పోటీలను ప్రారంభించారు.

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు



ప్రతిభచాటిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

పరిగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్-14, 17 బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించిన ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎంఈఓ-2 శేషాచలం, హెచ్‌ఎం కృపాసత్యరాజ్ సిబ్బంది అభినందించారు.

ముతవల్లీకి సన్మానం



అస్లాంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి

హిందూపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో జామియా మసీదు కమిటీ ముతవల్లీగా అస్లాం ఎన్నికైన సందర్భంగా శుక్రవారం ఆయనను సత్కరించారు. అల్‌హిలాల్ పాఠశాల ఆవరణలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర హాజరై మాట్లాడారు. ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు ముతవల్లీలు కృషిచేయాలన్నారు.హిందూపురంలో పేరుగాంచిన జామియా మసీదు ముతవల్లీగా ఎన్నికవడం అభినందనీయమన్నారు.

యాదవ సంఘం కార్యదర్శికి..



నర్సింహులును సన్మానిస్తున్న కూటమి నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం మల్లాపల్లిలో శుక్రవారం యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన నరసింహులుకు స్థానిక నాయకులు శశిభూషణ్ ఘనంగా సన్మానించారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ, కుల సంఘం రాష్ట్ర కార్యదర్శుల్లో స్థానం సంపాదించుకున్నందుకు ఆయనకు పూలమాలలువేసి, శాలువాలతో సన్మానించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సోమందేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిపర్తి గ్రామానికి చెందిన నరసింహమూర్తి అనే యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ తెలిపిన మేరకు నర్సింహమూర్తి గతంలో పోక్సో కేసులో ముద్దాయిగా ఉన్నాడన్నారు. శిక్షను అనుభవించి వచ్చాకకూడా అదే బాలికతో ప్రేమ వ్యవహారం నడుపుతుండగా పెద్దలు మందలించారన్నారు. తిరిగి ఎలాంటి కేసుల్లో ఇరుక్కుంటానోనని ఆత్మహత్యకు యత్నించి ఉండవచ్చన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మన్రోతోపు కబ్జాదారులపై చర్యలేవీ..?

● రెండు నోటీసులిచ్చినా స్పందన కరువు



కబ్జాకు గురైన మన్రోతోపు స్థలం

చిలమత్తూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణానికి మారుపేరుగా నిలిచిన కోడూరు మన్రోతోపు ఆక్రమణదారులపై చర్యలు ఉంటాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విలువైన ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు వారి పరిధిలో చర్యలకు పూనుకున్నారు. భూమిని ఆక్రమించి భవనాలు నిర్మించుకున్న వారికి పంచాయతీ అధికారులు 15వ తేదీన నోటీసులు జారీ చేశారు. 7 రోజుల గడువు ఇచ్చి ఆక్రమణలను తొలగించుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వారు స్పందించకపోవడంతో మరోసారి 22న రెండో నోటీసు ఇచ్చారు. ఆక్రమణలను తొలగించుకోవడానికి మరో 3 రోజుల గడవు ఇచ్చారు. అయితే ఇప్పటివరకు ఆక్రమణదారుల నుంచి ఏ మాత్రం స్పందన రాలేదు. ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాదారుల నుంచి విముక్తి అవుతుందా? లేక కబ్జాదారుల పాలవుతుందా అనే సందేహం వ్యక్తం మవుతోంది. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ పంచాయతీ అధికారులతో పాటు రెవెన్యూ, పోలీసు శాఖలకు కూడా సంబంధించినది. నెల రోజులుగా మన్రో తోపు ఆక్రమణలపై పెద్ద దుమారం రేగుతున్నా ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండో నోటీసు తరువాత ఆక్రమణదారులు స్పందించకపోతే నేరుగా అధికార యంత్రాంగం రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టవచ్చు. ఈ ప్రక్రియలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఎటువంటి బాధ్యత తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. నోటీసులు జారీ చేస్తున్నా కొందరైతే ఇప్పటికీ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటూ నిర్మాణాలు చేపడుతున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలకు కేటాయించిన స్థలంలో కూడా కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పాఠశాల కమిటీల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణలకు చోటిస్తే భవిష్యత్తులో పాఠశాలకు అవసరమైన స్థలాలు కరువయ్యే అవకాశం ఉంటుందని వెంటనే ఆక్రమణలు అడ్డుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటుచేయాలన్నారు. ఏది ఏమైనా నోటీసులకు కబ్జాదారులు దిగివస్తారా? లేక ఆక్రమణ తొలగింపు చర్యలు ఉంటాయా అన్నది వేచిచూడాలి.

'సమస్య పరిష్కరించకపోతే సమ్మె తప్పదు'



మున్సిపల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

పెనుకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నవంబరు 3 నుంచి సమ్మెబాట పడతామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 2023లో మున్సిపల్ కార్మికులకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు కరుణ్, మహేష్, వినోద్, బావక్క, గజేంద్ర, నర్సింహులు, శాంతమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ఉమర్‌ఖాన్

సోమందేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గోరంట్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున బహుమతులు ప్రదానం చేశారు. కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో విద్యార్థులకు డైరీలు అందించారు. మైనార్టీ యువనాయకుడు ఉమర్‌ఖాన్ విద్యార్థినులకు నగదు పురస్కారం అందజేశారు. మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు అందజేశారు.

ఆరోగ్యానికి ఆహారం, వ్యాయామం అవసరం



వైద్యులను సన్మానిస్తున్న కరస్పాండెంట్

పెనుకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి మంచి ఆహారంతోపాటు వ్యాయామం అవసరమని హిందూపురానికి చెందిన చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ కేశవులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రగతి గ్లోబల్ జెన్ పాఠశాలలో పిల్లల ఆరోగ్య పరిరక్షణపై వైద్య బృందం, కరస్పాండెంట్ శ్రీనివాసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేశవులు, గురువరణ్, వర్ధా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. హెచ్‌ఎం మంజువాణి, డైరెక్టర్లు సృజనాసాయి, శ్రీధర్‌సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



హెచ్‌ఎం రవీంద్రారెడ్డికి చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హిందూపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కె. బసవనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. శుక్రవారం ఈ మొత్తాన్ని హెచ్‌ఎం రవీంద్రరెడ్డికి శ్రీనివాసరెడ్డి, నరసింహమూర్తి అందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి విద్యార్థులు క్రీడా పరికరాలకు పూర్వ విద్యార్థులు స్పందించడం స్ఫూర్తిదాయకమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్‌కుమార్, అరుణ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

అగళి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలం బేగార్లపల్లిలో 27న అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ మధూడి తిప్పేస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలి రావాలని కోరారు.

అమరాపుర (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంకెర గ్రామంలో వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు భూమిపూజను ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలల్లోగా నిర్మాణాన్ని పూర్తీచేస్తామన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి



రోడ్డుపై బైఠాయించిన స్థానికులు

సోమందేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. హిందూపురం రోడ్డు కొత్తపల్లి క్రాస్‌వద్ద ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు అధికం అవుతోందన్నారు. దీనికితోడు పశువులు నిత్యం రోడ్డుపై సంచరిస్తుండటంతో వాహనదారులు వాటిని ఢీకొని గాయపడుతున్నారన్నారు. అలాగే వాహనాలు మితిమీరిన వేగంతో వస్తుండటంతో నియంత్రణ లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

కోనాపురం రోడ్డుకు మహర్దశ



నారాయణమ్మ కాలనీలో సీసీరోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలం నుంచి వర్షాలు పడ్డాయంటే పెనుకొండ-కోనాపురం రోడ్డులో ప్రయాణించాలంటే ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మంత్రి సవిత చొరవతో దశాబ్దాల కల నెరవేరింది. పెనుకొండలోని మడకశిర రహదారి నుంచి కోనాపురం రోడ్డువరకు రూ.80లక్షల నిధులు మంజూరు చేశారు. పెనుకొండ నుంచి నారాయణమ్మ కాలనీమీదుగా రెండు వరుసల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సురక్ష యాప్‌పై అవగాహన



మద్యం దుకాణాల్లో సురక్ష యాప్‌పై అవగాహన కల్పిస్తున్న కూటమి నేతలు

పెనుకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం అరికట్టేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్‌పై కూటమి నాయకులు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కన్వీనర్ శ్రీరాములు యాదవ్, రూరల్ కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్, బాబుల్‌రెడ్డి, బీజేపీ నాయకులు రామక్రిష్ణ, దత్తాత్రేయ, చంద్రాయుడు పట్టణంలోని మద్యం దుకాణాల్లో సురక్షయాప్‌పై అవగాహన కల్పించారు.

నేడు మంత్రి రాక

రొద్దం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బొక్సంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంఎస్‌ఎంఈ పార్కు అభివృద్ధి పనుల ప్రారంభానికి శనివారం మంత్రి సవిత విచ్చేస్తున్నట్లు టీడీపీ కన్వీనర్ నరహరి తెలిపారు. బొక్సంపల్లి గ్రామంవద్ద పెనుకొండ, పావగడ, ప్రధాన రహదారి పక్కన ఎంఎస్‌ఎంఈ పార్కులో రూ.7కోట్ల నిధులతో చేపట్టే పనులకు మంత్రి భూమిపూజ చేస్తారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఆయన కోరారు.

గుంతల రోడ్డును పూడ్చండి



గుంతలు పడి అధ్వానంగా మారిన కొమరేపల్లి, గొల్లహట్టి రోడ్డు

అగళి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరేపల్లి, గొల్లహట్టి రోడ్డు గుంతలమయంగా మారిందని, వెంటనే గుంతలను పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ఇబ్బందిగా మారిందన్నారు. సమస్యపై సర్పంచుకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కొమరేపల్లి, గొల్లహట్టి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

వాల్మీకి విగ్రహావిష్కరణ



జ్యోతుల ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రమేష్, నాయకులు

హిందూపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవ్‌మాకులపల్లిలో వాల్మీకి మహర్షి నూతన ఆలయం, విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. వాల్మీకి మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి విగ్రహంవద్ద సమర్పించారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్ మాట్లాడుతూ.. విగ్రహానికి నందమూరి బాలకృష్ణ రూ.50వేలు ఇచ్చారని, టీడీపీ నాయకులు అరుణాచల్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి విరాళాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, వాల్మీకి సంఘం నాయకులు వెంకటరమణ, గోళ్లాపురం ఆదినారాయణ, పవన్, ఆకుల సూరి, రాజు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన: ముద్దిరెడ్డిపల్లిలోని నందిసర్కిల్‌లో చౌడేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన భూమిపూజ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. కలశార్చన, మహాఅభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, కౌన్సిలర్ భారతి, మహాలక్ష్మి, రాఘవేంద్ర, జయప్ప, హరి, నేతప్ప పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

హంద్రీనీవా కాలువ పనుల పరిశీలన

అమరాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలదపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి శుక్రవారం పరిశీలించారు. సంబంధిత అధికారులను ఫోన్‌లో మాట్లాడి డిసెంబరులోగా చెరువుకు జలాలు అందించి శాశ్వత కరువు నివారణ చేపట్టాలనే ఉద్దేశంతో పనులు చేపట్టామన్నారు. సీఎం చంద్రబాబు జలహారతికి వస్తారని ఆయన తెలిపారు. జడ్పీటీసీ స్వారక నరసింహమూర్తి, మాజీ సర్పంచులు పాండురంగప్ప విశ్వనాథ్, బూదిపల్లి, జయరామప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ ముద్దరాజు, చంద్రప్ప యానిమేటర్, అశోక్‌కుమార్, శాంతకుమార్ పాల్గొన్నారు.

పనులను అడ్డుకున్న రైతులు

గుడిబండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర రెవెన్యూ పొలంలోని హెచ్ గొల్లహట్టి గ్రామ సమీపంలో చేపడుతున్న హంద్రీనీవా కాలువ పనులను రైతులు అడ్డుకున్నారు. శుక్రవారం హెచ్ గొల్లహట్టి గ్రామ సమీపంలో కాలువ పనులు జరుగుతుండగా అదే గ్రామానికి చెందిన చిత్తయ్య పనులు చేపట్టరాదని అడ్డుకున్నారు. కరికెర రెవెన్యూ పొలం 413-2సర్వేనంబర్లు విస్తీర్ణం6.13 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కాలువ పనులు చేపట్టారని, భూ పరిహారం ఇంతవరకు ప్రభుత్వం అందించలేదని రైతులు వాపోయారు. పరిహారం అందించి పనులు చేపట్టాలని రైతులు భీష్మించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

అగళి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 135కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు ట్రాన్స్‌కో అడిషనల్ డీఈ బాలకృష్ణ, మడకశిర డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు మండలానికి కొత్తగా 135కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామన్నారు. ఏఈ బాలాజీ, రాజన్న పాల్గొన్నారు.

జగన్‌రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో: టీడీపీ



నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

చిలమత్తూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టీడీపీ నాయకులు హితవుపలికారు. శుక్రవారం మండల కేంద్రంలో జగన్‌రెడ్డి ఎమ్మెల్యే బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ శాసన సభలో ప్రజా సమస్యల గురించి చర్చిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణని ఉద్దేశించి జగన్‌రెడ్డి నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మంచిది కాదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఒక్కరోజు కూడా అసెంబ్లీకి వెళ్లలేదని, ఇంట్లో కూర్చొని మీడియా ముందు పనికిరాని మాటలు మాట్లాడటం ఆయనకు అలవాటైందన్నారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు బేకరీ గంగాధర్, లక్ష్మీనారాయణ యాదవ్, గౌరీశంకర్, బాలాజీ, రంగారెడ్డి, బయపరెడ్డి, రంగప్ప, చంద్ర, మంజు, రాజశేఖర్, భాస్కర్, గంగాధర్ పాల్గొన్నారు.



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

లేపాక్షి(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై జగన్ మీడియా సమావేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం లేపాక్షిలో ఆయన దిష్టిబొమ్మను టీడీపీ నాయకులు దహనం చేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రజా సమస్యలను, సినీకార్మికుల సమస్యలు చర్చించడానికి అసెంబ్లీలో మాట్లాడితే జగన్ తాగి అసెంబ్లీకి వచ్చాడని అనడంపై మండిపడ్డారు. వెంటనే జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని లేదంటే తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో బైఠాయించి నిరసన చేపడతామని హెచ్చరించారు. మండల కన్వీనర్ అభి, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, నాయకులు ఈడిగ చంద్ర, అంగడి అంజి, తిప్పారెడ్డి, శ్రీరామప్ప పాల్గొన్నారు.

'మనోహర్ సేవలు మరువలేనివి'

మడకశిర టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ అధ్యక్షుడు మనోహర్ పార్టీ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం శివాపురంలోని ఆయన నివాసంలో ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వాల్మీకి సంఘం నాయకులు పుట్టకామప్ప, కౌన్సిలర్లు నాగేంద్ర, ఉమాశంకర్, క్లస్టర్ ఇన్‌చార్జి రవి పాల్గొన్నారు.

ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

లేపాక్షి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు సకాలంలో కార్యాలయానికి చేరుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే పీఏ వీరయ్య సూచించారు. శుక్రవారం పులమతి సచివాలయ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి దుర్గయ్యను పంచాయతీ అభివృద్ధి, మౌలిక వసతులపై ఆరాతీశారు.